క్లుప్తంగా

దాట్లకు రావిశాస్త్రి సాహిత్య పురస్కారం


దాట్ల దేవదానంరాజు

యానాం: విశాఖపట్నంలోని రావిశాస్త్రి లిటరరీ ట్రస్ట్ ఏటా అందించే ప్రతిష్టాత్మక రావిశాస్త్రి సాహిత్య పురస్కారానికి ప్రముఖ కవి, కథకుడు.. యానాంకు చెందిన దాట్ల దేవదానంరాజు ఎంపికయ్యారు. ఈ మేరకు గురువారం ఆయనకు ఆ సంస్థ నుంచి సమాచారం అందింది. స్థానికతను జోడించి వైవిధ్యమైన కథలు రచించినందుకు గుర్తింపుగా ఈ పురస్కారాన్ని అందిస్తున్నట్లు కన్వీనర్ డాక్టర్ డీవీ సూర్యారావు లేఖలో పేర్కొన్నారు. జూలై 30న రాచకొండ విశ్వనాథశాస్త్రి జయంతి రోజున విశాఖ పౌర గ్రంథాలయంలో పురస్కార సభ జరుగుతుందని తెలిపారు. గతంలో రావిశాస్త్రి పురస్కారం స్వీకరించిన వారిలో పద్మశ్రీ కొలకలూరి ఇనాక్, ఓల్గా, విహారి, పాపినేని శివశంకర్, ద్విభాష్యం రాజేశ్వరరావు ఉన్నారు. ఈ సందర్భంగా దాట్ల దేవదానంరాజు మాట్లాడుతూ, సాహిత్య జీవితంలో కథలపై ఇష్టాన్ని, ప్రేమనీ కలిగించిన రావిశాస్త్రి పేరున ఇస్తున్న ఈ పురస్కారం ఎంతో సంతోషాన్నిస్తుందన్నారు. ఈ సందర్భంగా సాహితీవేత్తలు పి.విష్ణుమూర్తి, శిఖామణి, వరుగు భాస్కరరెడ్డి, చింతా కొండలరావు, మధునాపంతుల, పానుగుమట్ల అశోక్ తదితరులు దాట్లకు అభినందనలు తెలిపారు.

యోగాంధ్రలో భాగస్వాములు కావాలి

ఐ.పోలవరం: యోగా ఆవశ్యకత తెలియజేసేందుకు, ఆరోగ్యాన్ని పెంపొందించేందుకు యోగాంధ్ర కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని ముమ్మిడివరం ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు (బుచ్చిబాబు) కోరారు. మండలంలోని మురమళ్ల క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ, జూన్ 21న విశాఖపట్నంలో జరిగే అతి పెద్ద యోగా దినోత్సవంలో పాల్గొనాలని ఆహ్వానిస్తున్నామన్నారు. గిన్నిస్ రికార్డు నెలకొల్పడమే లక్ష్యంగా దీనిని నిర్వహిస్తున్నామని చెప్పారు.

అన్నా క్యాంటీన్ తనిఖీ

అమలాపురం టౌన్: పట్టణంలోని అన్నా క్యాంటీన్‌ను మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్ గురువారం మధ్యాహ్నం ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్యాంటీన్‌లో రుచికరమైన భోజనం అందుతుందా, లేదా, పరిశుభ్రత ఎలా ఉంది వంటి అంశాలపై ఆరా తీశారు. రోజుకు ఎంత మంది భోజనం చేస్తున్నారు, ఇతర వివరాల రికార్డులను పరిశీలించారు.

ఎస్సీ పథకాల గెజిట్‌ను పునః సమీక్షించాలి

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా నాలుగు రీజియన్లలో ఉన్న ఎస్సీలకు ఆదిద్రావిడ శాఖ ద్వారా అమలు జరుగుతున్న వివిధ సంక్షేమ పథకాలను పొందడానికి ఆదాయ పరిమితిని విధిస్తున్నట్లు గురువారం పుదుచ్చేరి ప్రభుత్వం జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్‌ను పునః సమీక్షించాలని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ కోరారు. ఏడాదికి గతంలో ఆదాయ పరిమితి రూ.15వేలుగా ఉండేదని, కానీ ప్రస్తుతం కొన్ని విద్యా పథకాలకు ఆదాయ పరిమితిని రూ.24 వేలుగా సవరించారన్నారు. అదేవిధంగా కుటుంబ ఆదాయంతో సంబంధం లేకుండా, ఆస్తులను కలిగి ఉన్న కుటుంబాల్లో ఐదు ఎకరాల వ్యవసాయ భూమి, అంతకంటే ఎక్కువ, వెయ్యి చదరపు అడుగులు, అంతకంటే ఎక్కువ విస్తీర్ణంలో ఉన్న ప్లాట్లు, నోటిఫైడ్ మున్సిపాలిటీలో వంద చదరపు గజాలు, అంతకంటే ఎక్కువ నివాస స్థలం, ఇతర ప్రాంతాల్లో 200 చదరపు గజాలకు పరిమితి విధించడంతో అర్హులైన ఎస్సీలు అన్యాయానికి గురవుతారని ఎల్జీకి పంపిన వినతిపత్రంలో ఎమ్మెల్యే పేర్కొన్నారు.

విద్యుత్ టవర్ల ఏర్పాటు పూర్తి

అమలాపురం రూరల్: రామచంద్రపురం, ముమ్మిడివరం, అమలాపురం డబుల్ సర్క్యూట్ లైన్‌లో 30 టవర్ల ఏర్పాటు పూర్తయిందని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ గురువారం తెలిపారు. గత మార్చి 27న కొత్తపేట వద్ద డబుల్ సర్క్యూట్ లైన్ టవర్ కుప్పకూలడంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడిందని చెప్పారు. వెంటనే టవర్ల మార్పునకు ఆదేశించినట్టు చెప్పారు. రబీ సీజన్ కావడంతో టవర్ల మార్పులో అంతరాయం ఏర్పడిందన్నారు. మే 22 నుంచి దశలవారీగా పనులు చేపట్టారని, వేసవి కావడంతో, తక్కువ సమయం కోతలు విధిస్తూ, గురువారం నాటికి పూర్తి చేసినట్టు వివరించారు. టవర్ల మార్పు వల్ల నాణ్యమైన విద్యుత్ సరఫరా జరుగుతుందన్నారు. ట్రాన్స్‌కో, ఈపీడీసీఎల్ ఇంజినీర్లు, అధికారులను అభినందించారు.

నీటి కోసం రోడ్డెక్కిన గ్రామస్తులు

ఉప్పలగుప్తం: మండలంలోని చల్లపల్లి పంచాయతీ పరిధి వైరుపేటలో కొన్ని రోజులుగా తాగునీరు అందటం లేదంటూ గ్రామస్తులు గురువారం అమలాపురం-ఎస్.యానం ప్రధాన రహదారిపై ఖాళీ బిందెలతో నిరసన చేపట్టారు. కొన్ని రోజులుగా వైరుపేట ప్రాంతానికి తాగునీరు అందించడంలో అధికారులు అలసత్వం వహిస్తున్నారని ఆరోపించారు. పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను మొరపెట్టుకున్నా ప్రయోజనం లేదని వాపోయారు. అధికారులు తక్షణం సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బీఎస్పీ అమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి పాలమూరి మోహన్‌బాబు, మాజీ వైస్ ఎంపీపీ బడుగు మేరీశ్రీనివాస్ మద్దతు తెలిపారు. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కె.సురేష్‌ను వివరణ కోరగా, గ్రామంలో అంతగా సమస్య లేదన్నారు. ఏమైనా సమస్య ఉంటే పూర్తి స్థాయిలో పరిష్కరిస్తామని సమాధానమిచ్చారు.

బాధ్యులెవరు..?

- పట్టణంలో తాగునీటి కష్టాలు
- పంట కాలువపై వంతెనల నిర్మాణాలతో విడుదల కాని నీరు
- కాలువ నుంచి రా వాటర్ లేక అడుగంటుతున్న రిజర్వాయర్లు
- మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్ల సమ్మెతో తాగునీటి సరఫరా లోపాలు

అమలాపురం టౌన్: మున్సిపాలిటీలో పంట కాలువ నుంచి రిజర్వాయర్లలో రా వాటర్‌గా నింపాల్సిన గోదావరి జలాలు ఇప్పుడు అందుబాటులో లేక పట్టణంలో తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. అసలే తాగునీటి సరఫరా వ్యవస్థతో అవస్థలు పడుతున్న అధికారులు.. ముందుచూపుతో పంట కాలువలు మూసిన తర్వాత క్రాస్ బండ్లతో నీటిని ఒడిసి పట్టుకోవడంలో విఫలయ్యారు. స్థానిక ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఈదరపల్లి, నడిపూడిలో పంట కాలువపై రెండు వంతెనలు నిర్మించే ఏర్పాట్లు చేశారు. దీంతో నడిపూడి కాలువకు (బెండా కెనాల్)కు నేటికీ నీరును విడిచిపెట్టలేదు. ఈ ప్రభావం మున్సిపాలిటీకి చెందిన రా వాటర్ నిల్వ చేసే మూడు రిజర్వాయర్ల (చెరువులు)పై పడింది. దీనికితోడు మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్లు 43 రోజులుగా తమ డిమాండ్ల సాధన కోసం విధులను బహిష్కరించి సమ్మె చేస్తున్నారు. స్కిల్డ్ వర్కర్లు విధుల్లో లేకపోవడం వల్ల టెక్నీషియన్లు కరవై తాగునీటి సరఫరాకు అవరోధం ఏర్పడింది. మున్సిపాలిటీ చేసిన ప్రత్యామ్నాయాలు అంతగా ఫలించలేదు.

కౌన్సిల్‌పై నెట్టేలా!

ఈ క్రమంలో అడుగంటుతున్న రిజర్వాయర్లను ఎమ్మెల్యే ఆనందరావు బుధవారం సందర్శించి, ఈ చెరువులను రా వాటర్ (కాలువ నీరు)తో నింపడం కౌన్సిల్ వైఫల్యమని విమర్శించారు. దీంతో పాలక పక్షమైన కౌన్సిలర్లు ఎమ్మెల్యే కామెంట్‌ను ఖండించారు. వాస్తవానికి ఎమ్మెల్యే చొరవతోనే పంట కాల్వపై రెండు వంతెనల నిర్మాణం జరుగుతోంది. దాని వల్లే కాలువకు నీరు ఇవ్వడంలో జాప్యం అనివార్యమైంది. 43 రోజులుగా ఇంజినీరింగ్ వర్కర్లు రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె చేస్తున్నా కూటమి ప్రభుత్వం స్పందించడం లేదు. అమలాపురంలో అటు వంతెనల నిర్మాణం, పంట కాలువకు నీరు ఇవ్వకపోవడం, ఇటు ఇంజినీరింగ్ వర్కర్లు సమ్మెలో ఉండడంతో పట్టణంలో తాగునీటి కష్టాలు తీవ్రమయ్యాయి.

ముందుచూపు లేక..

తాగునీటి సరఫరాలో అంతరాయాలకు కారణమైన ఆయా అంశాలు ఎమ్మెల్యేతో ముడిపడి ఉన్నాయి. వంతెనల నిర్మాణం ఆయన కనుసన్నల్లోనే జరుగుతున్నాయి. ఇక్కడ ఇంజినీరింగ్ వర్కర్ల సమ్మెను తాను అధికార పార్టీ ఎమ్మెల్యేగా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాల్సిన బాధ్యతా ఆయనపైనే ఉంటే, సమ్మెను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. తాగునీటి సమస్యకు కారణమైన అంశాలకు కౌన్సిల్ వైఫల్యమేనని ఎమ్మెల్యే చేసిన కామెంట్‌పై పట్టణ ప్రజల్లోనే కాకుండా, వివిధ పార్టీల నాయకుల్లో చర్చ జరుగుతోంది. ఎమ్మెల్యే ప్రతి కౌన్సిల్ సమావేశానికి హాజరవుతున్నారు. మున్సిపాలిటీపై ప్రత్యేక దృష్టి పెట్టి, పట్టణాభివృద్ధిపై ప్రణాళికలు రచిస్తున్నారు. కౌన్సిల్‌లో ప్రతి కదలికా తెలుసుకునే నెట్‌వర్క్ ఎమ్మెల్యేకు ఉంది. అధికారులు కానీ, కౌన్సిల్ కానీ వంతెనల నిర్మాణంతో పంట కాలువపై క్రాస్ బండ్లు నిర్మించి రిజర్వాయర్లకు రా వాటర్ కొరత లేకుండా గోదావరి జలాలను ఒడిసిపట్టుకునే విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకుని వెళ్లకపోవడం వైఫల్యమే. ఇదే సమయంలో పంట కాలువపై వంతెనలు నిర్మిస్తున్న క్రమంలో మున్సిపల్ రిజర్వాయర్లకు రా వాటర్ పరిస్థితి ఏమిటనేది ఎమ్మెల్యే కూడా అధికారులు, కౌన్సిలర్లతో చర్చించాలి. పట్టణంలో తాగునీటి కొరతకు అందరూ తమ వైపు నుంచి ముందుచూపు లేకుండా వ్యవహరించడమే కారణమని అవగతమవుతోంది.


పట్టణంలో అడుగంటుతున్న అతి పెద్ద నడిపూడి రిజర్వాయర్

కౌన్సిల్ వైఫల్యం కానే కాదు

మున్సిపాలిటీలో తాగునీటి సమస్యలకు ముఖ్యంగా వంతెనల నిర్మాణాలతో నడిపూడి కాలువకు నీరు విడుదలలో జరిగిన జాప్యం, రిజర్వాయర్లలో రా వాటర్ లేక అడుగంటడమే కారణమైంది. దీనికి కౌన్సిల్ వైఫల్యమేనని ఎంచడం ఎమ్మెల్యేకు భావ్యం కాదు. వాస్తవానికి అధికారుల వైఫల్యం వల్లే ఇదంతా జరిగింది. రెండు వంతెనల నిర్మాణంతో కాలువ మూసివేసినప్పుడు రిజర్వాయర్లకు రా వాటర్ ఎలా అనే ప్రశ్న అధికారుల్లో తలెత్తాలి. అటు ఎమ్మెల్యేను, ఇటు కౌన్సిల్‌ను అప్రమత్తం చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. ఎమ్మెల్యే కూడా రెండు వంతెనల నిర్మాణంతో ఎదురయ్యే పరిణామాలపై ఆరా తీయాల్సింది.

– మట్టపర్తి నాగేంద్ర, కౌన్సిలర్, అమలాపురం మున్సిపాలిటీ

పవర్ లిఫ్టింగ్ పోటీల విజేతలు వీరే..


విజేత రవికుమార్‌కు బహుమతి అందజేస్తున్న కోచ్ వలీ

ఐ.పోలవరం: పవర్ ఫిట్నెస్ జిమ్‌జో మూడో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మురమళ్ల గ్రామంలో జిమ్‌లో శిక్షణ పొందుతున్న యువకులకు మూడు రోజుల పాటు పవర్ లిఫ్టింగ్, బెంజ్ ప్రెస్–2025 పోటీలు జరిగాయి. పవర్ ఫిట్నెస్ కోచ్ షేక్ వలీ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో విజేతల వివరాలను గురువారం వెల్లడించారు. పరిసర గ్రామాల నుంచి సుమారు 40 మంది క్రీడాకారులు పాల్గొన్నట్టు వివరించారు. కేటగిరీలు 45, 66, 76 కిలోల్లో మాస్టర్స్, బాయ్స్ విభాగాలకు పోటీలు జరిగాయి. 45 కిలోల విభాగంలో రవికుమార్, 66 కిలోల విభాగంలో పి.ప్రసాద్, 76 కిలోల విభాగంలో ఎస్.సతీష్ ప్రథమ స్థానాలు పొందారు. మొత్తం మూడు కేటగిరీల్లో మొదటి, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన 30 మందికి ట్రోఫీ, నగదు పురస్కారాలు, మెరిట్ సర్టిఫికెట్, మెడల్, నేషనల్ షీల్డ్‌లను అందించారు.

అతిసార వ్యాధి ప్రబలకుండా చర్యలు

కలెక్టర్ మహేష్‌కుమార్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం రూరల్: అతిసార వ్యాధి నివారణ చర్యల్లో గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య విభాగం, మున్సిపల్ ఇంజినీర్లు, పంచాయతీ కార్యదర్శులు కీలక భూమిక పోషించాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో మున్సిపల్, ఆర్‌డబ్ల్యూఎస్, జల వనరుల శాఖ, వైద్యారోగ్య శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి, డయేరియా వ్యాప్తికి కారణాలపై విశ్లేషించారు. ఆయన మాట్లాడుతూ, తాగునీటి పైపులైన్ల లీకేజీలపై సంబంధిత అధికారులు దృష్టి పెట్టాలని చెప్పారు. లేనిపక్షంలో వ్యాధి ప్రబలే అవకాశాలు ఉంటాయన్నారు. అమలాపురం, రాజోలు, ముమ్మిడివరం, పి గన్నవరం నియోజకవర్గాల్లో డయేరియా కేసులు నమోదవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యాధి వ్యాప్తికి కారణాలను అన్వేషించడంతో పాటు, నివారణ చర్యలను పటిష్టంగా చేపట్టాలన్నారు. నిత్యం తాగునీటి నాణ్యత పరీక్షలతో పాటు, చెరువులకు ప్రవహించే నీటి నాణ్యత ప్రమాణాలను ఎప్పటికప్పుడు విశ్లేషించి, వ్యత్యాసాలుంటే వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. ఐదేళ్లుగా వర్షాకాలం ప్రారంభంలో ప్రబలిన అతిసార కేసులను సమీక్షించారు. కొన్ని మండలాల్లో పైపులైన్ల లీకేజీలపై ఫిర్యాదులు అందుతున్నాయని, జూలై రెండు లోపు వాటిని అరికట్టి నివేదిక సమర్పించాలన్నారు. జిల్లా పంచాయతీ అధికారులు తమ పరిధిలోని 950 ఓవర్ హెడ్ ట్యాంకులను రెండు వారాలకోసారి క్రమం తప్పకుండా బ్లీచింగ్‌తో శుభ్రపరచాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్ల వద్ద నీరు కలుషితం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ హెచ్‌ఎస్‌వీ కృష్ణారెడ్డి, పంచాయతీ రాజ్ ఎస్ఈ పి.రామకృష్ణారెడ్డి, డీసీహెచ్ఎస్ కార్తీక్‌రెడ్డి, డీఎంహెచ్ఓ ఎం.దుర్గారావు దొర, డీఐఓ టీవీవీ సత్యనారాయణ, అదనపు డీఎంహెచ్ఓ హెచ్‌వీ వరలక్ష్మి, డీపీవో శాంతలక్ష్మి, డీఈవో షేక్ సలీమ్‌బాషా పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్

జిల్లాస్థాయిలో స్థానిక కిమ్స్ వైద్యశాలలో ఐదే వేల మందితో కామన్ యోగా ప్రొటోకాల్ యోగాసనాలు వేయించాలని కలెక్టర్ మహేష్‌కుమార్ అన్నారు. యోగా దినోత్సవంపై కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో సీఎం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జేసీ టి.నిషాంతి మాట్లాడుతూ, డిమాన్‌స్ట్రేషన్ అనుసరించి అందరూ సజావుగా యోగాసనాలు వేసేలా మాస్టర్ ట్రైనీలు కృషి చేయాలన్నారు.

అధికారులు విధిగా ప్రొటోకాల్ పాటించాలి

- ఎంపీపీ సునీత
- మండల పరిషత్ సర్వసభ్య సమావేశం


ప్రొటోకాల్ అంశంపై నిలదీస్తున్న వైస్ ఎంపీపీ నాగేంద్రప్రసాద్


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సునీత

తాళ్లరేవు: గ్రామ స్థాయిలో జరిగే కార్యక్రమాలకు స్థానిక ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వడంతో పాటు, అధికారులు విధిగా ప్రొటోకాల్ పాటించాలని ఎంపీపీ రాయుడు సునీత ఆదేశించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం ఎంపీపీ రాయుడు సునీత అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పలువురు సభ్యులు పలు సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. ప్రధానంగా చాలా గ్రామాల్లో తాగునీరు అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జల్‌జీవన్ మిషన్ ద్వారా సుమారు 90 శాతానికి పైగా పనులు పూర్తయినప్పటికీ, ప్రజలకు తాగునీరు సరఫరా కావడం లేదన్నారు. చాలా గ్రామాల్లో తాగునీరు అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. పలుచోట్ల పనులను అసంపూర్తిగా వదిలివేశారని వైస్ ఎంపీపీ డి.నాగేంద్రప్రసాద్ తెలిపారు. గ్రామాల్లో కుళాయిలు వదిలినపుడు మోటార్లను వేయడం వల్ల శివారు ప్రాంతాలకు నీరు అందడం లేదని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ సుకీర్తి తెలిపారు. ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఎంపీపీ సునీత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా పలు శాఖల ద్వారా చేపడుతున్న పథకాలను అధికారులు వివరించారు. మండల పరిషత్ కార్యాలయ భవనంలో సమావేశ మందిరంలో పెచ్చులూడుతూ ప్రమాదకరంగా మారిందని, తక్షణమే మరమ్మతులు చేపట్టాలని పలువురు సభ్యులు కోరారు. ఇటీవల వ్యవసాయ శాఖ ద్వారా నిర్వహించిన పవర్‌టిల్లర్ల, స్ప్రేయర్ల పంపిణీ కార్యక్రమంలో అధికారులు ప్రొటోకాల్ పాటించలేదని నాగేంద్రప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో కార్యక్రమం జరిగినప్పటికీ కనీసం సభ్యులకు గౌరవం ఇవ్వలేదన్నారు. అదే విధంగా గ్రామాల్లో జరిగే కార్యక్రమాలకు కనీసం సర్పంచ్‌లకు కానీ, ఎంపీటీసీ సభ్యులకు కానీ సమాచారం ఇవ్వడం లేదని కోరంగి ఎంపీటీసీ సభ్యురాలు పోతుల రత్నకుమారి, పి.మల్లవరం సర్పంచ్ పంపన రామకృష్ణ తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి కొంతమంది అనధికార వ్యక్తుల ఆదేశాలతో అధికారులు పనిచేయడం సిగ్గుచేటన్నారు. స్థానికంగా జరిగే కార్యక్రమాలకు స్థానిక ప్రజాప్రతినిధులకు కచ్చితంగా సమాచారం ఇవ్వాలని ఎంపీపీ సునీత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి సామ్యూల్ సాగర్, ఎంపీడీఓ కె.సత్యన్నారాయణ, వైస్ ఎంపీపీ కొపనాతి లలిత, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆర్య వైశ్య సంఘం సేవా కార్యక్రమాలు


గోశాలకు తవుడు బస్తాలు అందిస్తున్న సంఘ ప్రతినిధులు

అమలాపురం టౌన్: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆర్య వైశ్య సంఘం సంయుక్త కార్యదర్శి, అమలాపురం వాసవీ జాగృతి క్లబ్ అధ్యక్షుడు పసలపూడి సతీష్ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో పలు వితరణ కార్యక్రమాలు చేపట్టారు. పసలపూడి శ్రీరాములు జ్ఞాపకార్థం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలోని ఎస్‌కే వృద్ధాశ్రమంలో వృద్ధులకు కిరణా సరకులు సమకూర్చారు. శ్రీహరి మనో వికాస మానసిక దివ్యాంగుల కేంద్రంలో దివ్యాంగులకు దుప్పట్లు, టవళ్లు, బియ్యం బస్తా అందించారు. వాసవీ కన్యకా పరమేశ్వరి వైశ్య సంఘం గో సంరక్షణ కమిటీ ద్వారా స్థానిక బుచ్చెమ్మ అగ్రహారంలో నిర్వహిస్తున్న గోశాలకు తవుడు బస్తాలను సమకూర్చారు. ఆయా కార్యక్రమాల్లో సంఘ ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు వరదా సూరిబాబు, పట్టణ కార్యదర్శి నంబూరి నరేష్, గో సంరక్షణ కమిటీ కో–చైర్మన్లు కాళ్లకూరి రాము, పెదమల్లు నాగు, ఉమ్మడి జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు యెండూరి సీతా మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉప్పునీటి సమస్యపై రైతుల వినతి


ఉప్పునీటి సమస్యను ఎంపీకి వివరిస్తున్న రైతులు

అమలాపురం టౌన్: తమ పొలాల్లోకి చొచ్చుకొస్తున్న ఉప్పునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఉప్పలగుప్తం మండలానికి చెందిన రైతులు గురువారం అమలాపురంలో ఎంపీ గంటి హరీష్‌మాధుర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. అమలాపురంలోని ఎంపీ క్యాంపు కార్యాలయానికి వచ్చిన రైతులు తమ సమస్యపై ఎంపీతో చర్చించారు. మెయిన్ డ్రెయిన్ నుంచి సముద్రంలో కలిసే కాలువ పూడుకుపోవడంతో ఈ సమస్య ఉత్పన్నమవుతోందన్నారు. గ్రామాల్లోని పొలాల్లోకి ఉప్పు నీరు చేరి పంట నష్టం కలగడమే కాకుండా, కొబ్బరి చెట్లు సైతం దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపి తమను ఆదుకోవాలని రైతులు విజ్ఞప్తి చేశారు. సమస్యను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకుని వెళ్లి, పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీ హామీ ఇచ్చారు.

సూపర్ సిక్స్ అంటూ చంద్రబాబు మోసం

పుస్తకావిష్కరణలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ శ్రీకాంత్


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ శ్రీకాంత్, ఇతర నాయకులు

అమలాపురం రూరల్: ప్రజలకు సూపర్ సిక్స్ పథకాలన్నీ అమలు చేశామంటూ సీఎం చంద్రబాబునాయుడు ప్రకటించుకోవడం సిగ్గుచేటు అని వైఎస్సార్ సీపీ అమలాపురం నియోజకవర్గ కో–ఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్ విమర్శించారు. అమలాపురం రూరల్ మండలం భట్నవెల్లిలో మాజీ మంత్రి పినిపే విశ్వరూప్ నివాసంలో గురువారం పార్టీ పట్టణ అధ్యక్షుడు సంసాని బులినాని అధ్యక్షతన జగన్ అంటే నమ్మకం–చంద్రబాబు అంటే మోసం.. కూటమి ఏడాది పాలన వైఫల్యాలపై పుస్తకాన్ని డాక్టర్ శ్రీకాంత్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ, తప్పుడు కేసులు పెడుతున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయినా సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, మున్సిపల్ చైర్మన్ రెడ్డి నాగేంద్రమణి, వైస్ చైర్మన్ తిక్కిరెడ్డి వెంకటేష్, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ అబ్దుల్ ఖాదర్, కౌన్సిలర్లు కొల్లాటి దుర్గాబాయి, దొమ్మేటి రాము, కట్టోజు సన్నాయిదాసు, రామకృష్ణ, నాయకులు వంటెద్దు వెంకన్ననాయుడు, దూడల ఫణికుమార్, ఖాజాబాబు, సుంకర సుధా, దొంగ చిన్న, మద్దింశెట్టి ప్రసాద్, ఈతకోట శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

డీఐపీఆర్ఓ లక్ష్మీనారాయణకు సత్కారం


లక్ష్మీనారాయణను సత్కరిస్తున్న పాత్రికేయులు

అమలాపురం రూరల్: జిల్లా సమాచార, పౌర సంబంధాల శాఖాధికారిగా మూడేళ్లు సమర్థంగా పని చేసి, తూర్పుగోదావరి జిల్లాకు బదిలీ అయిన లక్ష్మీనారాయణను గురువారం ఘనంగా సన్మానించారు. ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు ఎంఎన్‌వీ ప్రసాద్, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కొండేపూడి సత్యనారాయణ, మాజీ అధ్యక్షుడు రంబాల నాగసత్యనారాయణ ఆధ్వర్యంలో ఆయనను కలెక్టరేట్‌లోని సమాచార శాఖ కార్యాలయంలో శాలువా, పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ, లక్ష్మీనారాయణ కోనసీమ జిల్లా డీఐపీఆర్ఓగా ఉత్తమ సేవలను అందించారన్నారు. ఈ కార్యక్రమంలో నూతన డీఐపీఆర్ఓ సీహెచ్ శ్రీనివాస్, పాత్రికేయులు వట్టికూటి గోవిందరావు, దొమ్మేటి వెంకట్, ఆకుల సురేష్, ఆకుల రవితేజ, సమయమంతుల హరి, మామిడిశెట్టి విష్ణు, దుర్గారావు, విజయ్, సమాచార శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆదర్శ ప్రాథమిక పాఠశాలగా సాకుర్రు గరువు


విద్యార్థులకు కిట్లు అందజేస్తున్న సర్పంచ్ తదితరులు

అమలాపురం రూరల్: తక్కువ మంది పిల్లలతో ఫౌండేషన్ స్కూల్‌గా ఉన్న సాకుర్రు గరువు పాఠశాలను ఆదర్శ ప్రాథమిక పాఠశాలగా మార్పు చేసి, నలుగురు ఉపాధ్యాయులను నియమించినట్టు సర్పంచ్ గుత్తుల చిరంజీవిరావు, మాజీ సర్పంచ్ చొల్లంగి సాయిబాబా తెలిపారు. సాకుర్రు గరువు మండల ప్రజా పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు గురువారం స్టూడెంట్ కిట్లను దాతలు పులవర్తి కృష్ణారావు, చొల్లంగి సాయిబాబా, ఉప్పే సత్యనారాయణ, ఆకుల సత్యనారాయణ, ఎస్ఎంసీ చైర్మన్ శిరగం ఫణేంద్రరావు సహకారంతో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం అప్పారి ముత్యాలరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఉద్యోగుల ఆందోళన


ఆర్ఏఓ ఆఫీసు వద్ద ధర్నా చేస్తున్న ఉద్యోగులు

యానాం: బకాయి వేతనాల చెల్లింపు, ఇతర డిమాండ్ల సాధనకు గురువారం యానాం మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో సిబ్బంది స్థానిక ఆర్ఏఓ ఆఫీసు ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గతేడాది ఆగస్టు నెలలో తాము నిరసన చేపట్టగా, ప్రభుత్వం ట్రెజరీ ద్వారా జీతాలు చెల్లించడానికి సీఎం రంగసామి అంగీకరించారంటూ ఎల్ఏడీ డైరెక్టర్ తమకు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఇప్పటివరకు ఆ హామీని నెరవేర్చలేదన్నారు. తమ జీతాలు, రిటైర్డ్ ఉద్యోగుల పెన్షన్లను చెల్లించాలని, ఏడో వేతన సంఘ సిఫార్సుల అమలుతో పాటు, 33 నెలల కాలానికి ఎరియర్స్ చెల్లించాలని, పాత పెన్షన్ స్కీమ్‌ను 232 మంది ఉద్యోగులకు అమలు చేయాలని, రోజువారీ వేతనాలు పొందుతున్న సిబ్బందిని స్థానిక పరిపాలన శాఖ రెగ్యులరైజ్ చేయాలని, యూనిఫైడ్ కేడర్ సిస్టమ్, పదోన్నతులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని వారు కోరారు. అనంతరం ఆర్ఏఓ మునిస్వామికి ఆందోళనకారులు వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు కృష్ణ, వైస్ ప్రెసిడెంట్ కర్రి రాంబాబు, కార్యదర్శి గోపీనాథ్, జాయింట్ సెక్రటరీ గోవిందరాజు, సబ్బతి నూకాంబరం, ఉద్యోగులు, పెన్షనర్లు పాల్గొన్నారు.

43వ రోజుకు చేరిన వర్కర్ల సమ్మె


అమలాపురం మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఇంజినీరింగ్ వర్కర్లు

అమలాపురం టౌన్: మున్సిపాలిటీల్లో అవుట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న ఇంజినీరింగ్ వర్కర్లు తమ డిమాండ్ల సాధన కోసం చేపట్టిన సమ్మె గురువారం నాటికి 43వ రోజుకు చేరకుంది. రామచంద్రపురం, మండపేట, అమలాపురం మున్సిపాలిటీల్లో ఉన్న 130 మంది వర్కర్లు సమ్మెలో ఉన్నారు. రాష్ట్ర యూనియన్ అయిదు రోజుల కార్యాచరణ ప్రణాళికను పంపించింది. తొలి రోజు గురువారం పత్రికా సమావేశాలు ఏర్పాటు చేసి తమ డిమాండ్లపై ప్రభుత్వం స్పందించని తీరును దుయ్యబట్టారు. రెండో రోజు (20వ తేదీ) మున్సిపల్ కమిషనర్, జిల్లా కలెక్టరేట్ కార్యాలయాల ముట్టడి, మూడో రోజు (21వ తేదీ) మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు, ఎమ్మెల్యేల ఇళ్ల ముట్టడి. నాలుగో రోజు (24వ తేదీ) ఇంజినీరింగ్ వర్కర్లు కుటుంబాల సభ్యులతో సమ్మెలో పాల్గొంటారు. అయిదో రోజు (25వ తేదీ) ఆమరణ దీక్షలకు పూనుకుంటారు.

జిల్లా అధ్యక్షుడిగా వీరబాబు

సమ్మెను జిల్లాలో ముందుకు నడిపించేందుకు జిల్లా యూనియన్ అధ్యక్షుడిగా అమలాపురం మున్సిపాలిటీ యూనియన్ ప్రధాన కార్యదర్శిగా ఉన్న యెరుబండి వెంకట సత్యనారాయణ (వీరబాబు)ను రాష్ట్ర యూనియన్ నియమించింది. ఇంజినీరింగ్ వర్కర్ల జీతాలను టెక్నికల్, నాన్ టెక్నికల్‌గా పెంచి ఇవ్వాలన్నది వారి ప్రధాన డిమాండ్. పదోన్నతులు కల్పించాలని, ఉద్యోగ విరమణ వయసు 62 సంవత్సరాలకు పెంచాలని, హెచ్‌ఆర్ పాలసీని అమలు చేయాలన్న డిమాండ్లతో సమ్మె చేపట్టారు.

బాధితురాలికి సాయం అందజేత

అమలాపురం రూరల్: బండారులంకలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో నల్లా ఈశ్వరి తీవ్రంగా గాయపడింది. ఆమె చికిత్సకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ రూ.50,800 చెక్కును ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద గురువారం బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే ఆనందరావు అందజేశారు.

సమాచారం లేకుండా విద్యుత్ కనెక్షన్ల తొలగింపు


వానపల్లిపాలెంలో సమాచారం లేకుండా కనెక్షన్ తొలగిస్తున్న విద్యుత్ సిబ్బంది

ఉప్పలగుప్తం: మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ అదనపు లోడు చార్జీపై స్పెషల్ డ్రైవ్ అంటూ అధికారులు గురువారం ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేశారు. సాధారణ సమయంలో సైతం విద్యుత్ అంతరాయంతో అవస్థలు పడుతుంటే, లోడు చార్జీ తక్కువగా ఉందన్న సాకుతో ముందస్తు సమాచారం లేకుండా హఠాత్తుగా కనెక్షన్లను తొలగించారని ఆయా గ్రామాల్లో ప్రజలు మండిపడ్డారు. అసలే విద్యుత్ చార్జీలు పెంచటంతో ప్రజలు అదనపు భారాన్ని మోస్తున్న తరుణంలో, మరలా లోడు చార్జీ ఏమిటని ప్రజలు ఆందోళనకు గురయ్యారు. విద్యుత్ అంతరాయం కలిగినప్పుడు గ్రామంలో ఉండి సమస్యను పరిష్కరించాల్సిన లైన్‌మన్, లైన్ ఇన్‌స్పెక్టర్ గ్రామాల్లో అందుబాటులో ఉండకుండా పట్టణాల్లో నివసించడంతో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని వినియోగదారులు వాపోయారు. సమస్య వచ్చినప్పుడు స్పందించని అధికారులు.. స్పెషల్ డ్రైవ్ పేరుతో సమాచారం లేకుండా విద్యుత్ కనెక్షన్‌లు తొలగించడంతో గర్భిణులు, వృద్ధులు, చిన్న పిల్లలతో తీవ్ర అవస్థలు ఎదుర్కొన్నామని ప్రజలు వాపోయారు.